




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 9 సంచిక : 210 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 5 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :210 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 5 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఆయనకు మనం ఎప్పుడూ అండగా ఉండాలి

- కేంద్ర మంత్రి కుమారస్వామికి అండగా ఉండాలని లోకేశ్ పిలుపు
- విశాఖ ఉక్కును కాపాడింది ఆయనేనని ప్రశంస
- కర్ణాటకలో సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ మంత్రి
- రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీతోనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశా ఖ మంత్రి హెచ్.డి. కుమార స్వామికి మనమందరం అండగా నిలవాలని ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కుమారస్వామి కాపాడారని, ఆయన కేంద్ర మంత్రిగా ఉండటం మన అదృష్టమని లోకేశ్ అన్నారు. కుమారస్వామికి

మిగతా 2లో




## అమరావతి పనుల్లో వేగం పెంచండి..
# గడువులో రాజీ లేదు

- రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష
- రూ.57,821 కోట్లతో పనులు... వేగం పెంచాలని అధికారులకు సీఎం ఆదేశం
- గడువు విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- ఇది కాంట్రాక్ట్ కాదు, చరిత్రలో భాగస్వామ్యం అవుతున్నారన్న సీఎం
- మానవ వనరులను పెంచుకోవాలని నిర్మాణ సంస్థలకు కీలక సూచన

పెన్ పవర్ డెస్క్:అమరావతి రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం రాజధాని నిర్మాణ పనులపై మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో ఉన్న రూ.57,821 కోట్ల విలువైన పనుల పురోగతిని ముఖ్యమంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మౌలిక వసతులతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణంపై చర్చించారు. గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన పనులను తిరిగి ప్రారంభించే క్రమంలో ఎదురైన సవాళ్లను, పెరిగిన

మిగతా 2లో



## అమిత్ షా పర్యటనలో భద్రతా వైఫల్యం...

### బెంగాల్‌లో పోలీసు అధికారుల సస్పెన్షన్

- నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసిన ఈసీ
- రెండు రోజుల క్రితం అమిత్ షా రోడ్ షోలో ఉద్రిక్తత
- బీజేపీ ఫిర్యాదు నేపథ్యంలో చర్యలు తీసుకున్న ఈసీ

మిగతా 2లో

## వైసీపీ దృష్టిలో అమరావతి శాసన రాజధాని మాత్రమే



- అమరావతిపై వైసీపీ వైఖరిని స్పష్టం చేసిన బొత్స
- అమరావతి కోసం రూ. 1.10 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్న
- అమరావతిని వేగంగా పూర్తి చేయకపోతే ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తామని హెచ్చరిక

మిగతా 2లో



## ఆ సినిమాలపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది

- కేరళలో ఎన్నికల ప్రచారం
- ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన ప్రధాని మోదీ
- సినిమాలపై కూడా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపణ
- 'ది కేరళ స్టోరీ', 'కశ్మీర్ ఫైల్స్', 'ధురంధర్' చిత్రాల ప్రస్తావన
- సీఏఏ, యూసీసీలపై కూడా అబద్ధాలు వ్యాప్తి చేశారని విమర్శ

మిగతా 2లో


# గీత దాటితే సస్పెన్షన్ తప్పదు

### ఎమ్మెల్యే అరవిందబాబుపై చంద్రబాబు సీరియస్

- పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో అరవిందబాబు రచ్చ
- తాను సిఫారసు చేసిన వ్యక్తిని జిల్లా పోలీస్ సెల్ న్యాయ సలహాదారుగా ఎందుకు ఆమోదించలేదని ప్రశ్న
- ఎస్పీ వివరణ ఇచ్చినా తగ్గని అరవిందబాబు
- క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సస్పెండ్ చేస్తానన్న చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే... నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు పల్నాడు ఎస్పీ కార్యాలయంలో దాదాపు 10 గంటల పాటు బైఠాయించడం వివాదానికి కేంద్రబిందువైంది. జిల్లా పోలీస్ సెల్ న్యాయ సలహాదారుగా తాను సిఫారసు చేసిన రామినేని ప్రసాద్ పేరును ఎందుకు ఆమోదించలేదని ఎస్పీ బి.కృష్ణారావును అరవిందబాబు నిలదీశారు. ఎస్పీ వివరణ ఇచ్చినా వినకుండా, నియామక ఉత్తర్వుల కాపీ చేతికి వచ్చేవరకు కదిలేది లేదని ఎస్పీ ఛాంబర్‌లోనే కూర్చున్నారు.

మిగతా 2లో





### అమరావతి అంటే అప్పు కాదు...
## 5 కోట్ల ఆంధ్రులకు ఆక్షయపాత్ర

- భూకబ్జాలు, అవినీతికి వైసీపీనే బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శ
- రాజధానిపై వైసీపీ నేతలు గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపణ
- రుషికొండ, అమరావతి నిర్మాణ ఖర్చులపై చర్చకు రావాలని సవాల్
- పార్లమెంట్ చట్టంతో అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత లభించిందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:అమరావతి రాజధాని అప్పుల కుప్ప కాదని, అది 5 కోట్ల ఆంధ్రులకు అక్షయపాత్ర అని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న అన్నారు. భూక బ్జాలు, అవినీతికి వైసీపీనే కేరాఫ్ అడ్రస్‌గా మారిందని

మిగతా 2లో

### బీఆర్ నాయుడిని తొలగించాలని
## రోజా, భూమన డిమాండ్


- టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు
- ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అపశ్రుతులు జరుగుతున్నాయన్న భూమన
- నాయుడుపై చర్యలు తీసుకోకపోవడం చంద్రబాబు చేతగానితనమన్న రోజా
- లడ్డూ విషయంలో చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలని సిట్ నివేదికలో తేలిందని వ్యాఖ్య



మిగతా 2లో

### ప్రళయం విరుచుకుపడడానికి
## 48 గంటలే మిగిలి ఉంది
### ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం

- హర్మూజ్ జలసంధిని మూసివేయవద్దని ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- 48 గంటల్లో నరకం చూపిస్తామని, 20 రెట్ల బలంతో దాడి చేస్తామని స్పష్టీకరణ
- ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావంతో పెరుగుతున్న గ్యాస్ ధరలు
- అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో తాజా పరిణామాలు




పెన్ పవర్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు అత్యంత తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని మూసివేసే ప్రయత్నం చేస్తే కేవలం 48 గంటల్లో ప్రళయం తప్పదని, నరకం చూపిస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు.ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి ద్వారా సరఫరాను అడ్డుకుంటే, అమెరికా 20 రెట్లు ఎక్కువ బలంతో ప్రతిదాడి చేస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇప్పటికే ఇరాన్ చర్యల

మిగతా 2లో

# ఇరాన్‌పై ఆగని దాడులు..
## శాశ్వత పరిష్కారం కావాలన్న అబ్బాస్ అరాఘ్చీ

- యుద్ధానికి శాశ్వత ముగింపు కావాలన్న ఇరాన్ విదేశాంగ మంత్రి
- చర్చలకు నిరాకరించినట్టు వస్తున్న వార్తలను ఖండన
- టెహ్రాన్‌లోని కీలక సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు
- ఇరాన్ పెట్రోకెమికల్ కంపెనీలపై దాడిలో పలువురికి గాయాలు
- రెండు అమెరికా యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు వెల్లడి

పెన్ పవర్ డెస్క్:అమెరికాతో చర్చలకు ఇరాన్ నిరాకరించిందంటూ వస్తున్న వార్తలను ఆ దేశం ఖండించింది. చర్చలకు తాము ఎప్పుడూ సిద్ధమేనని, అయితే తమపై బలవంతంగా రుద్దిన ఈ యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే తమ ప్రధాన

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# రాహుల్ గౌరవంగా తప్పుకోవడమే మంచిదా!?

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష సభ్యుడు రాహుల్‌గాంధీ.. గౌరవంగా పార్టీ పదవుల నుంచి తప్పు కోవడమే మంచిదా? ఆయన మౌనంగా ఉండడమే బెటరా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. దాదాపు మూడు ఎన్నికలుగా పార్టీని గెలిపించుకోలేక పోతున్న వైనంతోపాటు.. ఆయన వ్యవహరిస్తున్న తీరు కూడా.. పార్టీలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్యంగా కేంద్రంలోని బీజేపీని టార్గెట్ చేసే విషయంలోనూ ఆయన వెనుకబడుతున్నారు. ఈ పరిణామాలు.. పార్టీలో తీవ్ర అసంతృప్తికి, వ్యతిరేక ధోరణికి కూడా దారితీస్తున్నాయి. రాహుల్‌పై గత కొన్నాళ్లుగా సీనియర్లు అసంతృప్తితోనే ఉన్నారు. పార్టీ కాదన్నా.. ఔనన్నా ఇది నిజం. ప్రస్తుత ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఈఅసంతృప్తి పరోక్షంగా పార్టీని దెబ్బతీసేలా వ్యవహరించేలా చేస్తోంది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కనీస పరువు నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ అల్లాడుతోంది. ఈ క్రమంలో నాయకులు కూడా ఐక్యంగా ఉండాలి.కానీ, దీనికి భిన్నమైన వైఖరితో సీనియర్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల వేళ పనిగట్టుకుని పోరుగు పార్టీ బీజేపీని భుజాన మోస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీని పరోక్షంగా ఆకాశానికి ఎత్తేస్తున్నారు. పశ్చిమాసి యాలో నెలకొన్న యుద్ధం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సరిగా వ్యవహరించడం లేదని.. ముఖ్యంగా అమెరికా కనుసన్నల్లో మోడీ పాలన సాగిస్తున్నారని.. రాహుల్‌గాంధీ పార్లమెంటులోనూ బయట కూడా విమర్శలు గుప్పిస్తున్నారు.అయితే.. దీనికి భిన్నంగా పార్టీ సీనియర్లు పలువురు... మోడీని మెచ్చుకుంటున్నారు. మోడీ చాలా స్థితః ప్రజ్ఞతతో వ్యవహరిస్తున్నారని.. అందుకే ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నా.. భారత్‌లో మాత్రం దానికి భిన్నంగా చమురు, గ్యాస్‌కు ఎలాంటి ఇబ్బందులు లేవని.. బీజేపీ నాయకుల కంటే కూడా.. ఎక్కువగా కాంగ్రెస్ సీనియర్లు ఎక్స్ వేదికగా మోడీని కొనియాడేస్తున్నారు. ఈ ప్రభావం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలపై పడే అవకాశం కనిపిస్తోంది.

**రాహుల్‌పైనే రచ్చ!**

అయితే.. ఈ కారణాల నేపథ్యంలో రాహుల్ ఎందుకు మౌనంగా ఉండాలన్నది ప్రశ్న. ఎందుకంటే.. సీని యర్లకు, రాహుల్ గాంధీకి మధ్య భారీ గ్యాప్ పెరుగుతోంది. ఇది ఎన్నికల వేళ మరింత ఎక్కువగా ఉంటోం ది. కేవలం రాహుల్‌పై ఉన్న అక్కసుతోనే.. సీనియర్లు యూటర్న్ తీసుకుంటున్నారన్నది వాస్తవం. అందుకే మరికొందరు నాయకులు రాహుల్ గౌరవంగా తప్పుకోకపోతే.. పార్టీ మరింతగా నష్టపోతుందని వ్యాఖ్యానిస్తున్నారు.

## అమరావతి పనుల్లో వేగం పెంచండి..

# గడువులో రాజీ లేదు

- మొదటి పేజి తరువాయి

నిర్మాణ వ్యయాన్ని అధిగమించి టెండర్లు పూర్తి చేసి పనులు అప్పగించిన తీరును అధికారులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం రాజధానిలో 20 వేల మంది కార్మికులు, నిపుణులు పనిచేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడు తూ... "రాజధాని నిర్మాణం అనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్ కాదు. ఈ బృహత్కార్యంలో పాలుపంచుకుంటున్న మీరంతా చరిత్రలో భాగస్వాములు అవుతున్నారు. ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉండొచ్చు, కానీ ఒక రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు" అని అన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి 'ఫ్యూచర్ సిటీ'గా నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో సాకారం చేయాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలదేనని స్పష్టం చేశారు. ప్రతి నిర్మాణ సంస్థ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు, నెలవారీ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. ఎంత మంది కార్మికులు, ఎంత యంత్ర సామగ్రి అవసరం, ప్రస్తుతం ఎంత వాడుతున్నారనే వివరాలను ఆరా తీశారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పూర్తి చేయాల్సిన పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యత, వ్యయ నియంత్రణ, గ్రీన్ ఎనర్జీ, ఆధునిక టెక్నాలజీ వినియోగం తప్పనిసరి అని స్పష్టం చేశారు. పనుల పూర్తి కోసం అవసరమైతే మానవ వనరులను పెంచుకోవాలని, ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## వైసీపీ దృష్టిలో అమరావతి శాసన రాజధాని మాత్రమే

అమరావతి రాజధాని విషయంలో వైసీపీ వైఖరిని బొత్స సత్యనారాయణ మరోసారి స్పష్టం చేశారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపినప్పటికీ... వైసీపీ మాత్రం తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. తాజాగా బొత్స మాట్లాడుతూ... అమరావతి తమకు కేవలం శాసన రాజధాని మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. తద్వారా 'మూడు రాజధానుల' విధానానికే తాము కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. కేవలం అమరావతి కోసమే రూ. 1.10 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. ఇంత భారీ మొత్తాన్ని ఒకే చోట వెచ్చించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము అమరావతికి వ్యతిరేకం కాదని, కేవలం రాజధాని అభివృద్ధి పేరుతో జరిగే అవినీతికి మాత్రమే వ్యతిరేకమని అన్నారు. అమరావతి ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం వేగంగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో తాము ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచించాల్సి ఉంటుందని హెచ్చరించారు.గత వైసీపీ ప్రభుత్వం వికేంద్రీకరణ పేరుతో అమరావతి,

విశాఖపట్నం, కర్నూలులను మూడు రాజధానులుగా ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించేందుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత సాధించడంతో పాటు, పనులను వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో బొత్స చేసిన వ్యాఖ్యలు వైసీపీ తన పాత వైఖరికే కట్టుబడి ఉందనే సంకేతాలను ఇస్తున్నాయి.

## ప్రళయం విరుచుకుపడడానికి 48 గంటలే మిగిలి ఉంది

- మొదటి పేజి తరువాయి

వల్ల హర్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరిగాయి."ఇక ఆలస్యం కాకముందే ఓ ఒప్పందానికి రండి" అంటూ ట్రంప్ ఇరాన్‌కు సూచించారు. యుద్ధం నాలుగో వారానికి చేరిన నేపథ్యంలో, అవసరమైతే ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లపై కూడా దాడి చేస్తామని ట్రంప్ గతంలో బెదిరించారు. అంతేకాకుండా, హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికా తీసుకోదని, చమురు అవసరమైన దేశాలు తమ నౌకలను తామే రక్షించుకోవాలని లేదా అమెరికా నుంచి చమురు కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.ట్రంప్ హెచ్చరికలతో అంతర్జాతీయంగా

ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. యుద్ధం కారణంగా ఇప్పటికే దెబ్బతిన్న ఇరాన్ చమురు ఎగుమతులపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమరావతి అంటే అప్పు కాదు... 5 కోట్ల ఆంధ్రులకు ఆక్షయపాత్ర

- మొదటి పేజి తరువాయి

ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం నాడు అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్, వైసీపీ నేతల తీరును ఎండగట్టారు. తాడేపల్లి ప్యాలెస్ పెత్తందారుడి అవినీతిని కప్పిపుచ్చి, ఆ పాపాన్ని చంద్రబాబుకు అంటగట్టాలని సజ్జల రామకృష్ణారెడ్డి అండ్ కో ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

**రాజధానిపై వైసీపీలో గందరగోళం**

అమరావతి అంశాన్ని వైసీపీ నేతలు ఒక మ్యూజికల్ చైర్ గేమ్‌గా మార్చేశారని బుద్ధా వెంకన్న విమర్శించారు. ఒకవైపు సజ్జల రామకృష్ణారెడ్డి అమరావతి వద్దు అంటుంటే, మరోవైపు బొత్స సత్యనారాయణ రాజధానిని పూర్తి చేయాలని అంటారని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి మూడు రాజధానులు, మెంటల్ గన్ అంటూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని, ఒక విధానమంటూ లేని పార్టీ వైసీపీ అని దుయ్యబట్టారు. అమరావతిపై విషం చిమ్మడం అంటే రాష్ట్ర యువత భవిష్యత్తుపై దాడి చేయడమేనని ఆయన హెచ్చరించారు.

**అమరావతి అప్పు కాదు.. రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్**

రాజధాని ఖర్చు ప్రజలపై పడుతుందంటూ సజ్జల చెబుతున్నది అతిపెద్ద డ్రామా అని వెంకన్న కొట్టిపారేశారు. "అమరావతి కోసం రైతులు ఇచ్చిన భూముల విలువ సుమారు రూ. 3 లక్షల కోట్లు. నాడు చంద్రబాబు హైదరాబాద్‌లో ఎకరం లక్ష రూపాయల భూమిని రూ. 150 కోట్లకు ఎలా చేర్చారో, అమరావతిని కూడా అదే స్థాయి గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి మిగులు భూముల ద్వారా వచ్చే నిధులతో రాజధానిని నిర్మించడమే కాకుండా, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలను అభివృద్ధి చేయవచ్చు. ప్రభుత్వ నిధులతో పనిలేకుండా సంపద సృష్టించే మ్యాజిక్ అమరావతి సొంతం" అని ఆయన వివరించారు.

**భూకబ్జాలపై మాట్లాడేందుకు వైసీపీకు అర్హత లేదు**

భూముల గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీ నేతలకు లేదని బుద్ధా వెంకన్న అన్నారు. చంద్రబాబు 500 ఎకరాలతో ఐటీ రంగాన్ని తెచ్చి 30 లక్షల ఉద్యోగాలు కల్పిస్తే, జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో 5.30 లక్షల ఎకరాల భూములను కబ్జా చేసి ఒక్క ఉద్యోగమైనా ఇవ్వలేదని ఆరోపించారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములు 8,000 ఎకరాలు, ఇడుపులపాయలో 600 ఎకరాల అసైన్డ్ భూములు, కడప, స్వర్ణముఖి ఫారెస్ట్ భూములను వైకాపా నేతలు కబ్జా చేశారని ఆయన ఆరోపణలు చేశారు. కబ్జా సంస్కృతి వైసీపీది అయితే, కల్పతరువు లాంటి అభివృద్ధి సంస్కృతి టీడీపీదని స్పష్టం చేశారు.

**నిర్మాణ ఖర్చులపై చర్చకు సిద్ధమా?**

జగన్ రెడ్డి తన విలాసం కోసం రుషికొండలో పర్యావరణాన్ని నాశనం చేసి, చదరపు అడుగుకు రూ.35,000 ఖర్చుతో రెండంతస్తుల

భవనం కట్టారని, అదే అమరావతిలో 50 అంతస్తుల భవనాన్ని చదరపు అడుగుకు కేవలం రూ.6,000తో నిర్మిస్తుంటే బురదజల్లుతారా అని ప్రశ్నించారు. రుషికొండ ప్యాలెస్, అమరావతి నిర్మాణ ఖర్చులపై చర్చకు వైకాపా నేతలు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు.

**రాజధానికి సంపూర్ణ చట్టబద్ధత**

ఇన్నాళ్లు రాజధానికి చట్టబద్ధత లేదని మాట్లాడటం వైసీపీ నేతల అవగాహనారాహిత్యానికి నిదర్శనమని వెంకన్న అన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులతో పాటు ఇప్పుడు పార్లమెంట్ చట్టం ద్వారా అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత లభించిందని తెలిపారు. ఇది పెట్టుబడిదారుల్లో కొండంత విశ్వాసాన్ని నింపిందని, 175 నియోజకవర్గాల యువతకు కల్పతరువుగా మారుతుందనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ప్రాంతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టే జగన్‌కు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని, చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం జరిగి తీరుతుందని బుద్ధా వెంకన్న ధీమా వ్యక్తం చేశారు.

## బీఆర్ నాయుడిని తొలగించాలని

# రోజా, భూమన డిమాండ్

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడును తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ నేతలు నిరసనలు ఉద్ధృతం చేశారు. అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రత్యేక పూజలు నిర్వహించి, కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తిరుమలలో అనేక వివాదాలు, అపశ్రుతులు చోటుచేసుకుంటున్నాయని భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ నాయుడు వ్యవహారశైలి వల్ల కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని మండిపడ్డారు. ఆయనను చైర్మన్ పదవి నుంచి తొలగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను లక్ష్యంగా చేసుకుని రోజా ఘాటు వ్యాఖ్యలు చేశారు. "బీఆర్ నాయుడుపై చర్యలు తీసుకోలేకపోవడం చంద్రబాబు చేతగానితనం. తమ వ్యక్తిగత విషయాలను ఎక్కడ బయటపెడతారో అని లోకేశ్, చంద్రబాబు భయపడుతున్నారా?" అని ప్రశ్నించారు. "లడ్డూ నెయ్యి విషయంలో ఏమీ లేకపోయినా మెట్లు కడిగిన పవన్ కల్యాణ్... ఇప్పుడు బీఆర్ నాయుడు వ్యవహారంలో ఎలాంటి 'ప్రోక్షణ' చేస్తారు? దీనిపై ఎందుకు స్పందించడం లేదు?" అని నిలదీశారు. లడ్డూ విషయంలో చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలని సిట్ నివేదికలో తేలిందని... కాబట్టి చంద్రబాబు అలిపిరి వద్ద సాష్టాంగ నమస్కారం చేసి హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## అమిత్ షా పర్యటనలో భద్రతా వైఫల్యం...

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటనలో భద్రతా వైఫల్యం, ఘర్షణ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసింది. రెండు రోజుల క్రితం అమిత్ షా పశ్చిమ బెంగాల్‌లోని భవానీపూర్‌లో పర్యటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షోలో ఉద్రిక్తత చోటుచేసుకుంది.దీనితో బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి నివేదిక ఇవ్వాలని బెంగాల్ ప్రధాన కార్యదర్శిని కోరింది. ఆయన నివేదిక సమర్పించడంతో దాని ఆధారంగా ఈసీ చర్యలు తీసుకుంది. అమిత్ షా పర్యటనలో అనేక భద్రతా వైఫల్యాలు ఉన్నట్లు గుర్తించింది. దీనికి బాధ్యులను చేస్తూ సిద్ధార్థ్ దత్తా అనే డీసీపీ సహా మరో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ ఈసీ నిర్ణయం తీసుకున్నది. అధికారులు శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమయ్యారని పేర్కొంది.కాగా, భవానీపూర్ నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు. ఆమెపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సువేందు అధికారి బరిలోకి దిగారు. దీనితో ఈ నియోజకవర్గం కీలకంగా మారింది. ఇక్కడ మమతా బెనర్జీని ఓడించాలని బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది.

## ఆ సినిమాలపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది

ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్ష పార్టీలు 'ధురంధర్', 'ది కేరళ స్టోరీ', 'ది కశ్మీర్ ఫైల్స్' వంటి సినిమాలతో పాటు పలు అంశాలపై ఉద్దేశపూర్వకంగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని ఆయన బహిరంగంగా ఆరోపించారు. కేరళ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఒక బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. "కాంగ్రెస్, యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ పార్టీలు ప్రతి విషయంలోనూ అబద్ధాలు చెబుతాయి. అది వారి నైజంగా మారింది. దేశాన్ని తప్పుదోవ పట్టించడమే వారి స్వభావం" అని అన్నారు. సినిమాల విషయంలోనూ ప్రతిపక్షాలు ఇదే తీరును ప్రదర్శిస్తున్నాయని ఆయన విమర్శించారు. "అబద్ధాలు చెప్పడంలో వారు నిపుణులు. 'ది కేరళ స్టోరీ' వచ్చినప్పుడు అదంతా అబద్ధం అన్నారు. 'ది కశ్మీర్ ఫైల్స్' వచ్చినప్పుడు కూడా అదే మాట అన్నారు. ఇప్పుడు 'ధురంధర్' సినిమా విషయంలోనూ అబద్ధమని ప్రచారం చేస్తున్నారు" అని ప్రధాని పేర్కొన్నారు. గతంలో సీఏఏ చట్టం తెచ్చినప్పుడు కూడా దేశవ్యాప్తంగా ఎన్నో అబద్ధాలు ప్రచారం చేశారని, కానీ ఇప్పుడు ఆ చట్టం అమల్లోకి వచ్చినా దేశానికి ఎలాంటి నష్టం జరగలేదని మోదీ గుర్తుచేశారు. "యూసీసీ, ఎఫ్‌సీఆర్ఏ వంటి అంశాల్లోనూ వారు అవే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. గోవాలో దశాబ్దాలుగా యూసీసీ అమల్లో ఉంది. అబద్ధాలు వ్యాప్తి చేయడమే వారి వ్యాపారం" అని ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు.ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్', వివేక్ అగ్నిహోత్రి రూపొందించిన 'ది కశ్మీర్ ఫైల్స్', సుదీప్తో సేన్ డైరెక్ట్ చేసిన 'ది కేరళ స్టోరీ' చిత్రాలు వాటి కథావస్తువుల కారణంగా రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, కశ్మీరీ పండిట్ల వలస, కేరళ యువతుల ఉగ్రవాద రిక్రూట్‌మెంట్ వంటి అంశాలపై ఈ సినిమాలు తెరకెక్కాయి.

## ఆయనకు మనం ఎప్పుడూ అండగా ఉండాలి

- మొదటి పేజి తరువాయి

ఎప్పుడూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.కర్ణాటకలోని సింధనూరు హోసళ్లీ క్యాంపులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్‌ను శనివారం లోకేశ్ ప్రారంభించారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ ప్రసంగించారు. కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఆయన కొనియాడారు. దేశం కోసం సైనికులు చేస్తున్న ప్రాణత్యాగాలను ఎప్పటికీ మర్చిపోకూడదని అన్నారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.

## గీత దాటితే సస్పెన్షన్ తప్పదు

- మొదటి పేజి తరువాయి

మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత కార్యాలయాల నుంచి ఫోన్లు వచ్చినా ఎమ్మెల్యే తన పంతం వీడకపోవడం చర్చనీయాంశమైంది.

ఈ వ్యవహారంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ గౌరవాన్ని పణంగా పెట్టేది లేదు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే పునరాలోచన లేకుండా సస్పెండ్ చేస్తా. రాజకీయాల్లో సుదీర్ఘ కాలం ఉండాలనుకుంటున్నారా? లేక ఒక్కసారే ఎమ్మెల్యేలుగా మిగిలిపోవాలనుకుంటున్నారా? మీరే తేల్చుకోవాలి" అంటూ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తేవడం, కార్యాలయాల్లో బైఠాయించడం వంటి చర్యలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయని, ఇలాంటి వాటిని భరించే ప్రసక్తే లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఇరాన్‌పై ఆగని దాడులు.. శాశ్వత పరిష్కారం కావాలన్న అబ్బాస్ అరాఘ్చీ

- మొదటి పేజి తరువాయి

లక్ష్యమని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ శనివారం స్పష్టం చేశారు. అమెరికా మీడియా తమ వైఖరిని తప్పుగా చిత్రీకరిస్తోందని ఆయన ఆరోపించారు.పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్‌లో అమెరికా అధికారులతో జరిగే చర్చలకు ఇరాన్ హాజరుకావడం లేదని వాల్ స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ప్రచురించింది. ఈ కథనాన్ని ఖండిస్తూ అరాఘ్చీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో ఒక ప్రకటన విడుదల చేశారు. "చర్చల కోసం ఇస్లామాబాద్ వెళ్లడానికి మేము ఎప్పుడూ నిరాకరించలేదు. మధ్యవర్తిత్వ ప్రయత్నాల కోసం పాకిస్థాన్‌కు మేం కృతజ్ఞతలు తెలుపుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు.ఈ ఏడాది ఫిబ్రవరి 28న టెహ్రాన్‌తో పాటు ఇతర ఇరాన్ నగరాలపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేయడంతో ఈ వివాదం మొదలైంది. ఈ దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకుడు అలీ ఖొమైనీ మరణించారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్, మధ్యప్రాచ్యంలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది."మాపై రుద్దిన ఈ చట్టవిరుద్ధమైన యుద్ధానికి శాశ్వతమైన, నిశ్చయాత్మకమైన ముగింపు పలికే నిబంధనలే మాకు ముఖ్యం" అని అరాఘ్చీ తన ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ కన్నా, యుద్ధాన్ని పూర్తిగా ఆపే ఒప్పందంపైనే తమ దృష్టి ఉందని ఆయన పరోక్షంగా తేల్చిచెప్పారు.

# రాజధాని అమరావతికి చట్టబద్ధత లభించడం చారిత్రాత్మక విజయం.

**-ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా**



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్ 04:**రాజధాని అమరావతికి చట్టబద్ధత లభించడం చారిత్రాత్మక విజయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా అన్నారు. అమరావతి చట్టబద్ధతకు దీపాలతో మద్దతుగా ప్రత్తిపాడు మండలం, పెద శంకర్లపూడిలోని తమ నివాసంలో ఇంటి ముందు దీపాలు వెలిగించి ఆనందాన్ని పంచుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ అమరావతి అభివృద్ధికి ప్రజల యొక్క పూర్తి మద్దతు ఉంటుందని, రాష్ట్ర భవిష్యత్తుకు ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ప్రజా సేవలో సేవలందించిన కూటమి వార్డు మెంబర్లు కు ఘన సన్మానం



**తాజా మాజీలకు చిన్నబాబు చిరు సత్కారం**

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 04;**పెనికేరు గ్రామంలో ప్రజాసేవలో విశేషంగా సేవలందించిన ప్రజాప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ 2తో పదవీకాలం ముగిసిన ఐదుగురు కూటమి వార్డు మెంబర్లను సత్కరించేందుకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వెంకటేశ్వర సంస్థల అధినేత ఈదర చిన్నబాబు ఆధ్వర్యంలో ఆయన నివాసంలో అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల విశ్వాసంతో గెలుపొందిన వార్డు సభ్యులకు చిన్నబాబు సాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. గ్రామాభివృద్ధి కోసం వారు చేసిన కృషిని కొనియాడుతూ, వారి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ, "గ్రామాభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు చేసిన కృషి ఆదర్శప్రాయమైంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారు పనిచేసిన తీరు అభినందనీయం" అని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో వారి పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 4 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,67,750, అన్నదాన విరాళాల ద్వారా రూ. 77,825, కేశ ఖండన ద్వారా రూ. 6,440 తులాభారం ద్వారా రూ. 550 లడ్డు ప్రసాదం ద్వారా రూ. 14,925, మొత్తం రూ. 2,67,490 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, సుమారు రెండు వేల ఎనిమిది వందల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ మొయిళ్ళ సంధ్య, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పాలకవర్గానికి సత్కారం



**అల్లవరం, పెన్ పవర్,ఏప్రిల్ 4:**అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామంలో మంచినీరు చెరువు అభివృద్ధి అయిదు కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని అల్లవరం ఎంపిపి ఇళ్ల శేషగిరిరావు తెలిపారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఉప సర్పంచ్ గుర్రం శ్రీను, పాలకవర్గ సభ్యుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఎంపీపీ శేషగిరిరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ కొమరగిరిపట్నం ప్రజలు ఆదరణతోటే నేను గెలుపొందానని గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించామని తెలిపారు. పంచాయితీ ప్రత్యేక అధికారి మేడిద నారాయణరావు, కార్యదర్శి చిక్కం శ్రీను, ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజల ఆదరణతోటే గ్రామాభివృద్ధి జరిగిందని, నా ఐదు సంవత్సరాల కాలంలో ప్రజల నుండి ఏ సమస్య వచ్చినా పరిష్కరించామని, త్రాగునీటి సమస్య కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించామని తెలిపారు. కరోనా టైంలో రెండు సంవత్సరాలు ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ్య గా ఉంచి అభివృద్ధి బాటలో నడిపించామని తెలిపారు. గ్రామంలోకి కేరళ నుంచి వచ్చిన బృందం రాష్ట్రంలో 24 పంచాయతీలు లో మన పంచాయతీకి ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు నడింపల్లి సీతారామరాజు, అల్లూరి సురేష్ రాజు, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మామిడి శెట్టి శ్రీనివాస్, సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుని శెట్టి రోహిణి కుమార్, పరస కిరణ్ కుమార్, నిమ్మకాయల శేఖర్, దండు బుజ్జి, దాట్ల బుజ్జి రాజు, బీహెచ్ రాజు, పోచనపెద్ది పెద్ది వెంకటేష్, నల్లా రాము మూడు పంచాయతీల సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# కట్టమూరు పంచాయతీ ప్రత్యేక అధికారి బాధ్యతలు స్వీకరణ

**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 4 :** పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో కె.వి. సూర్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న సర్పంచ్, పాలకవర్గ పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయనను ప్రత్యేక అధికారిగా నియమించిన విషయం తెలిసిందే.. కట్టమూరు పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులకు మొదటి ప్రాధాన్యతనిస్తామని, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న సిమెంటు రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని,

?ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా కార్యాలయంలో సంప్రదించవచ్చని అన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో

కట్టమూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి మజ్జి శ్రీనివాస్, టీడీపీ క్లస్టర్ 2 ఇంచార్జి ఎలిశెట్టి నాని, గ్రామ తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దవులూరి రాజేష్, కట్టమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్ పర్సన్ సానిపిన శ్రీదేవి రామకృష్ణ, జిల్లా వర్తక సంఘం డైరెక్టర్ తుమ్మలపల్లి దుర్గారావు, పెద్దాపురం ఎస్సీ సెల్ కార్యదర్శి ఉప్పిటి బాలరాజు, పెద్దాపురం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు నంది ఉమామహేశ్వరి, జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అడపా శివ దుర్గ, కట్టమూరు నీటి సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రామకృష్ణ, శ్రీ కేశవ పట్టాభిరామస్వామి దేవస్థానం చైర్మన్ దూళ్ళ నాగేంద్ర, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు భువనాశి దొరబాబు, పెట్లు వీరభద్రరరావు, చిక్కాల సాయిరాం, గంధం రాజా,




ఆదిన వెంకటరమణ, కోరెడ్డి సతీష్, జనసేన పార్టీ నాయకుడు చెన్నం వెంకన్నబాబు, సచివాలయ, పంచాయితీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లిలో శనివారం ప్రత్యేక దర్శనం -- వేలాదిగా తరలివచ్చిన భక్తులు




**భక్తులతో కిక్కిరిసిన వాడపల్లి ఆలయం**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 4 :**కోనసీమ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన వాడపల్లి తిరుమల వెంకన్న స్వామి దేవస్థానం లో శనివారం అర్ధరాత్రి నుంచే భక్తి పరవశం వెల్లివిరిసింది. వేకువ జామున ప్రారంభమైన స్వామివారి మేలుకొలుపు సేవతో ఆలయ ప్రాంగణం మంగళ వాద్యాల నినాదాలతో మార్మోగింది. అనంతరం అర్చకులు సంప్రదాయబద్ధంగా అలంకరణోత్సవాన్ని ఘనంగా




నిర్వహించడంతో భక్తులు ఆ దివ్య దర్శనాన్ని కన్నులారా వీక్షించారు. ప్రత్యేకంగా "ఏడువారాల ఎంకన్న" దర్శనానికి అపారమైన విశ్వాసం ఉన్న భక్తులు తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం వేళల నుంచే ఆలయం వద్ద భక్తుల రద్దీ అధికమై, క్యూలైన్లు కిలోమీటర్ల మేర సాగాయి. స్వామివారి నిలువెత్తు దర్శనం కోసం భక్తులు గంటల తరబడి నిరీక్షిస్తూ భక్తిశ్రద్ధలతో జపాలు, భజనలు చేస్తూ కనిపించారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు సమర్థవంతమైన ఏర్పాట్లు చేశారు. ఉచిత దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విశ్రాంతి ఏర్పాట్లు, భద్రతా చర్యలు కూడా బలోపేతం చేశారు.రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆలయం చుట్టుపక్కల మాడవీధులు అన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రతి మూలలో "గోవిందా... గోవిందా..." నినాదాలు మారుమోగుతూ భక్తి వాతావరణాన్ని మరింత ఆవిష్కరించాయి. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు స్వామివారి దర్శనాన్ని ఎంతో భక్తితో స్వీకరించి ఆనందభాష్పాలతో నిండిపోయారు.స్వామివారి దర్శనం అనంతరం ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని వేలాది మంది భక్తులు స్వీకరించారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న సేవ భక్తులకు సహాయం అందిస్తూ సేవాభావాన్ని చాటారు.




# ఆలమూరు జనార్ధన స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 04;**

ఆలమూరు జనార్ధనస్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి ఆలయంలో నాలుగు ప్రదక్షిణలు, నాలుగు శనివారాల భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవానాచార్యులు స్వామివారికి తొలి హారతి నిర్వహించారు. అనంతరం భక్తులు దర్శనాలు చేసుకున్నారు. స్వామివారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి వారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



# ఏలేశ్వరం గురుకులం లో న్యాయ అవగాహనసదస్సు.

**ఫోక్సో చట్టం బాలికలకు రక్షణ కవచం: ప్రతిపాడు సివిల్ కోర్ట్ జడ్జ్ లంక గోపీనాథ్.**





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 4:** ఏలేశ్వరం పిఎం శ్రీ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు సివిల్ కోర్టు జడ్జి లంక గోపీనాథ్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సదస్సులో జడ్జి గోపీనాథ్ మాట్లాడుతూ ఫోక్సో చట్టం బాలికలకు, మహిళలకు రక్షణ కోసం వంటిది అన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహలు, సైబర్ నేరాలుపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పోక్సో చట్టం ద్వారా పిల్లల హక్కుల పరిరక్షణ గురించి వివరించారు.బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు , చట్టపరమైన పరిణామాలను తెలియజేశారు. అలాగే సైబర్ భద్రతపై ముఖ్యమైన చేయవలసినవి, చేయకూడనివి ప్రతి మహిళా తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు సాంకేతికతను సురక్షితంగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు చట్టాలను గౌరవించే బాధ్యతాయుత పౌరులుగా పరిణితి చెందాలని అన్నారు. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శారద, ఎస్సై రామలింగేశ్వరరావు,ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజాల చిట్టిబాబు, పూర్వపు అధ్యక్షులు చిట్టం చెట్టి పుల్లయ్య, న్యాయవాదులు బుగతా శివన్నారాయణ, అధ్యాపకులు, కళాశాల విద్యార్థినిలు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడాలి.

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంచి బుద్ధి ప్రసాదించాలి.
- టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడును తక్షణమే తొలగించాలి
- ఉత్తరకంచి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముద్రగడ గిరిబాబు ప్రత్యేక పూజలు.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,ఏప్రియల్ 04**:తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను మంటగలుపుతున్న ప్రస్తుత టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుని తక్షణమే పదవి నుండి తొలగించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని డిమాండ్ చేస్తూ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు నియోజకవర్గ వైసిపి శ్రేణులతో కలసి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామంలో ఉన్న శ్రీ పద్మావతి అలివేలుమంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ముద్రగడ గిరిబాబుకు స్థానిక వైసిపి నాయకుడు, నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు రామిశెట్టి దొరబాబు అపూర్వ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ముద్రగడ గిరిబాబు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ పరమ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా ఉంటూ బి.ఆర్. నాయుడు చేస్తున్న అనైతిక కార్యకలాపాలు, ఆయన వాడుతున్న భాష కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయన్నారు.భక్తులు ఇంతగా ఆందోళన చెందుతున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎటువంటి చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండడం దురదృష్టకరమన్నారు.టీటీడీ పవిత్రతను కాపాడాలంటే బి.ఆర్. నాయుడుని తక్షణమే ఛైర్మన్ పదవి నుండి తొలగించాలని గిరిబాబు డిమాండ్ చేశారు.ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వర స్వామి భక్తుల నమ్మకాన్ని ప్రభుత్వం గౌరవించాలిలని గిరిబాబు డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రాష్ట్ర వైసిపి రాష్ట్ర కార్యదర్శి, వాసిరెడ్డి జమీల్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద్,ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండల పార్టీ అధ్యక్షులు రామిశెట్టి నాని,గొల్లపల్లి సురేష్,నరాల శ్రీను, చింతకాయల సత్యన్నారాయణ,మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, జడ్పీటిసి లు బెహరా దొరబాబు,గొల్లు చినదివాణం వైసిపి జిల్లా ఆర్టిఐ అధ్యక్షులు గౌతు స్వామి,జిల్లా వైసిపి ఎస్సి సెల్ అధ్యక్షులు శెట్టిబత్తుల కుమార్ రాజా,నియోజకవర్గం ఎస్సి సెల్ అధ్యక్షులు గుడాల వెంకటరత్నం,నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు గొంతిరెడ్డి సతీష్,ప్రత్తిపాడు వైస్ ఎంపిపి బంకు శ్రీను,వాణిజ్య విభాగం కార్యదర్శి అడపా సోమేశ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బీశెట్టి అప్పలరాజు,దలే చిట్టిబాబు,సకురు గుర్రాజు,ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు,పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

## ఐదేళ్ల అభివృద్ధికి చిరస్మరణీయ సేవలు... శీల సర్పంచ్ కోమలి వెంకటరమణకు ఘన సత్కారం



**కాజులూరు, పెన్ పవర్,ఏప్రిల్ 4:**కాజులూరు మండల పరిధిలోని శీల గ్రామానికి ఐదేళ్ల పాటు అంకితభావంతో సేవలందించిన సర్పంచ్ కోమలి వెంకటరమణకు పదవీ విరమణ సందర్భంగా గ్రామ సచివాలయంలో ఘన సత్కారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి బి. హేమావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన సేవలను అభినందించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి హేమావతి మాట్లాడుతూ,గ్రామ అభివృద్ధి కోసం కోమలి వెంకటరమణ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఆయన నాయకత్వంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడినట్లు,ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చూపిన పట్టుదల ప్రశంస నీయమని అన్నారు.అనంతరం సర్పంచ్ కోమలి వెంకటరమణ మాట్లాడుతూ,తన పదవీకాలంలో గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసినట్లు తెలిపారు.ఈ ఐదేళ్లలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ, గ్రామ ప్రజల సహకారంతో వాటిని అధిగమించి అనేక సమస్యలకు పరిష్కారం చూపగలిగామని చెప్పారు. తన పాలన విజయవంతం కావడానికి తోడ్పడిన పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, కూటమి నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముమ్మిడి గోపయ్య, నల్లమిల్లి రామారెడ్డి,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు), గుంటముక్కల వెంకటేశ్వరరావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు,చిట్నీడి వెంకటరమణ,కంచి సింహాద్రి, గుంటముక్కల సతీష్, కాలా శ్రీను, చింతపల్లి సత్తిబాబు,ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రారంభమైన రబీ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ..

గండేపల్లి మండలం యర్రపాలెంలో ధాన్యం కనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ..





**గండేపల్లి,పెన్ పవర్, ఏప్రిల్, 4:**గండేపల్లి మండలం యర్రంపాలెం గ్రామంలో పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రబీ 2025-26 ధాన్యం కనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ.. కాకినాడ జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ ముఖ్య అతిథులుగా హాజరై ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో రబీ సీజన్ ధాన్యం సేకరణకు పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. ధాన్యం కనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టామని జిల్లాలో ధాన్యం సేకరణకు 227 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో పనిచేసేందుకు అవసరమైన సిబ్బందిని, యంత్ర పరికరాలను సమకూర్చడం జరిగిందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ధాన్యం కనుగోలు కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు అందరూ సద్విని చేసుకోవాలని జేసీ కోరారు.

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రైతులు పండించిన ధాన్యం అమ్మకంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార అంతరంగాన్ని అప్రమత్తం చేసిందని, రబీ సీజనులో 09 ధాన్యం కనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలోనే తమ బ్యాంకు ఖాతాలోకి రాష్ట్ర ప్రభుత్వం సొమ్ము జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, ఎర్రంశెట్టి బాబ్జి, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కొత్త భైరవకృష్ణ తదితరులతో పాటు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్. విజయ్ కుమార్, సివిల్ సప్లైస్ డైరెక్టర్ వై.మాలకొండయ్య, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం దేవుల నాయక్, పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజు, డీసీవో బి.శ్రీనివాస్ రెడ్డి, జగ్గంపేట ఎడిఎ జీ.శ్రీనివాసు; జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్, గండేపల్లి మండలం తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.సత్య హరి కృష్ణ రెడ్డి, మండల వ్యవసాయ అధికారిని జె.లక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారి కాళ్ళ బలరామకృష్ణ , గ్రామ సర్పంచ్ ముత్యాల దుర్గారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు జాన్ క్రిస్టోఫర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా నైదాన రవి.



**కిర్లంపూడి, పెన్ పవర్ ఏప్రియల్ 04:** జగ్గంపేట నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడుగా కిర్లంపూడి గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు నైదాన రవి నియమితులయ్యారు. శనివారం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య నైదాన రవికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నైదాన రవి మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో బీసీల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులను నియమించేందుకు అన్ని చర్యలు చేపడతానన్నారు. జగ్గంపేట నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన నైదాన రవికి కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామాలకు చెందిన పలువురు ప్రముఖులు, పెద్దలు అభినందనలు తెలియజేశారు.

## ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "టోస్ట్మాస్టర్స్ డిస్ట్రిక్ట్ 126, ఏరియా జి-2" పోటీల నిర్వహణ






**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 4:**గండేపల్లి మండలం సూరంపాలెం, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ది.04.04.2026 వ తేదీన "టోస్ట్మాస్టర్స్ డిస్ట్రిక్ట్ 126, ఏరియా జి-2" పోటీలలో భాగంగా ఇంటర్నేషనల్ స్పీచ్ కాంటెస్ట్ మరియు టేబుల్ టాపిక్ కాంటెస్ట్ లు నిర్వహించారని, కళాశాల ఛైర్మన్ డా॥ పరుచూరి కృష్ణారావు తెలియచేసారు.

ఈ కార్యక్రమాన్ని టోస్ట్మాస్టర్ శ్రీ కుమార్ వర్మ, ఏరియా జి-2 డైరక్టర్ ప్రారంభించారని వీరితో పాటు కొంత మంది కార్పోరేట్ సంస్థలకు చెందిన ప్రముఖులు హాజరై న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా న్యాయనిర్ణేతలు మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు వారి స్పీకింగ్ స్కిల్స్ను మెరుగుపరుచుకుంటూ, ఆత్మ విశ్వాసాన్ని, సమయస్ఫూర్తితో ఆలోచించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా విజయాలు సాధించవచ్చు అని పేర్కొన్నారు.

ప్రస్తుత పోటీలలో ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో పాటు జిల్లాకు చెందిన ప్రముఖ కళాశాలలైన ఎస్.ఆర్.కె.ఆర్., భీమవరం, కైట్, కాకినాడ మరియు కైట్ (ఉమెన్), కాకినాడ విద్యార్థులు పాల్గొన్నారని తెలియజేసారు. ఈ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులు డివిజన్ స్థాయిలో పాల్గొనడానికి అర్హత పొందుతారని క్లబ్ కోఆర్డినేటర్ శ్రీమతి ఎం. మాధవి తెలియజేసారు. ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించుకునే అవకాశాన్ని కలుగజేసిన కళాశాల యాజమాన్యానికి తమ కృతజ్ఞతలు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో డైరక్టర్ మేనేజ్మెంట్ శ్రీ ఎం.వి. హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎమ్. సతీష్, డైరక్టర్-అకడమిక్స్ డా॥ కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డా॥ జి.నరేష్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ శ్రీమతి ఎం.మాధవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో పోలీసుల కార్డెన్ సెర్చ్




**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 4:** జగ్గంపేట నెహ్రూ కాలనీలో జగ్గంపేట సీఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో సిబ్బందితో శనివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు, గండేపల్లి ఎస్సై శివ నాగబాబు, కిర్లంపూడి ఎస్సై సతీష్ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. కాలనీలో సుమారు 100 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి, సరైన ధ్రువపత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించినా, మత్తు పదార్థాలు విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దొంగతనాలు జరగకుండా స్థానికులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచనలు చేశారు.

## నక్కాఅప్పలరాజు వ్యాపారంగంలో మరిన్ని విజయాలు సాధించాలి.

ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.





**కిర్లంపూడి, పెన్ పవర్ ఏప్రియల్ 04:** స్నేహశీలి సౌమ్యుడు,నక్కా అప్పలరాజు వ్యాపార రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు.

కిర్లంపూడి మండలం జగపతినగరం నక్కా అప్పలరాజు స్వగృహంలో నూతన కోకో కోలా వైష్ణవి ఏజెన్సీ ప్రారంభోత్సవం ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముద్రగడ గిరిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి వైష్ణవి ఏజెన్సీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ, అప్పలరాజు వ్యాపార రంగంలో మరిన్ని విజయాలు అందుకోవాలని, సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోకోకోలా అసిస్టెంట్ సేల్స్ మేనేజర్, బి అప్పన్నదొర, సేల్స్ ఎగ్జిక్యూటివ్ లు, జి సుబ్రహ్మణ్యం,ఆర్ మణికంఠ, జగపతినగరం మాజీ సర్పంచ్ లు పెంటకోట నాగబాబు, కర్రి సూర్య కుమార్, కిర్లంపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు చదలవాడ బాబి, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు కుర్ల చినబాబు, టిడిపి నాయకులు తుమ్ కుమార్, కాళ్ళ వెంకటేష్, పెద్దలు ఆడారు సోమేశ్వరావు తూము చినబాబు, శరకణం భద్రం, లంక మూర్తి, కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామాలకు చెందిన పలువురు పెద్దలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని నక్కా అప్పలరాజు వ్యాపారాభివృద్ధి సాధించాలని ఆశీస్సులు అందజేశారు.

# దళితుడిపై దాడి హేయమైన చర్య

**స్పీకర్ అయ్యన్న పాత్రుడిని బర్తరఫ్ చేయాలి**

**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 4 :**వైసీపీ ఎస్సీ నాయకుల డిమాండ్ మండపేట: నర్సీపట్నంలో జరిగిన ఓ జాతరలో దళిత డప్పు కళాకారుడిపై స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్సీపీ ఎస్సీ నాయకులు ఖండించారు. విజయలక్ష్మి నగర్లోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎస్సీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించి దళితుడిపై అయ్యన్న పాత్రుడు జరిపిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళితులకు గానీ దళిత మహిళలకు గానీ రక్షణ లేకుండా పోయిందన్నారు. రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న అయ్యన్న పాత్రుడు ఒక సాధారణ వ్యక్తి మాదిరి ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. అహంకార దర్పంతో గౌరవ ప్రదమైన పదవిలో ఉన్నాననే సంగతి మర్చిపోయి పోలీసుల సమక్షంలోనే దళిత వృద్ధుడిపై చేయి చేసుకోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన వారే ఇలాంటి చర్యలకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. ఇటీవల కాలంలో దళితులపై దాడులు, అక్రమ కేసులు, కులవివక్ష పెచ్చుమీరుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగ హక్కులను కాలరాసే విధంగా ప్రవర్తిస్తే తాము సహించేది లేదని హెచ్చరించారు. దళితుడిపై జరిగిన ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుడికి న్యాయం చేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే మండపేటలో ఎస్టీ వర్గానికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ రామును అనుమతుల కోసం మున్సిపల్ కమిషనర్ రూ.5 లక్షలు లంచం అడిగి, రూ.1.5 లక్షలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఈ ఘటనపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పరిరక్షణే తమ లక్ష్యమన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



సమావేశంలో వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్, నియోజకవర్గ కన్వీనర్ నక్కా సింహాచలం, ఆర్టీఐ కన్వీనర్ మందపల్లి రవికుమార్, ముమ్మిడివరపు బాపిరాజు, ఎంపీటీసీ పలివెల మధు, పార్టీ నాయకులు తవిటికి రత్నకుమార్, కొడమంచిలి భాస్కర్, నాతి పట్టాభి, కోణాల సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పిచ్చుకులంక గోదావరిలో ముగ్గురు యువకులు గల్లంతు

**ఒక మృతదేహం లభ్యం ఇద్దరు కోసం గాలింపు చర్యలు**



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 4:**ఆత్రేయపురం మండలం బొబ్బరలంక గ్రామం శివారు పిచ్చి క లంక వద్ద విషాదకర ఘటన చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి దిగిన రాజమండ్రి జామిపేట కు చెందిన నలుగురు యువకులు ప్రమాదానికి గురయ్యారు.నలుగురిలో ముగ్గురు యువకులు నదిలో మునిగిపోగా, వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడి ఒడ్డుకు చేరుకున్నారు. మిగిలిన వారు నది ప్రవాహంలో చిక్కుకోవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక యువకుడి మృతదేహం లభ్యమైంది. ఇంకా ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.



## గ్రామాల అభివృద్ధే లక్ష్యం... ప్రత్యేక అధికారిగా బాధ్యతలు





తహసిల్దార్ జి.ఆర్. ఠాగూర్

**కాజులూరు, పెన్ పవర్,ఏప్రిల్ 4:**కాజులూరు మండల పరిధిలోని పల్లిపాలెం, కోలంక, దుగ్గదూరు, బంధనపూడి తదితర గ్రామపంచాయతీలలో తహసిల్దార్ మరియు మెజిస్ట్రేట్ జి.ఆర్. ఠాగూర్ శనివారం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయనకు ఘన స్వాగతం లభించింది.కూటమి నాయకులు,పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి ఠాగూర్‌కు శు భాకాంక్షలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, సీహెచ్ రవికుమార్, పి. సుబ్బారాయుడు, ప్రసాద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాయుడు కొండ, ఆదినారాయణ, కాదా బుజ్జి, రామకృష్ణ, దూడల శంకరనారాయణ, గుబ్బల నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు బొండా నరసింహ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా పల్లిపాలెం గ్రామంలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా జి.ఆర్. ఠాగూర్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను పారదర్శకంగా పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి గ్రామానికి సరిపడా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతామని ఆయన మీడియాకు తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఆర్వోలు జి. రాధాకృష్ణ, దేగల సుబ్రహ్మణ్యం, ధరణి, శ్రీపాదం సూరిబాబు, శ్రీరాం, లోవరాజు, సలాది సాయిబాబు, పంచాయతీ సెక్రటరీ సీహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జగపతినగరం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్ 04:** కిర్లంపూడి మండలం జగపతినగరం, బూరుగుపూడి,ముకొల్లు రామకృష్ణాపురం,గ్రామాలకు ప్రత్యేక అధికారిగా నియమితులైన కిర్లంపూడి ఎంపీడీఓ బావిశెట్టి హరికృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బావిశెట్టి హరికృష్ణ మాట్లాడుతూ స్థానిక నాయకులు,ప్రజలు సహకారాలతో ఆయా గ్రామాల అభివృద్ధికి, కృషి చేయడమే కాకుండా స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

## పేదలకు వరం సీఎం సహాయ నిధి -ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట. పెన్ పవర్. ఏప్రిల్ 4 :**ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఒక వరమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఇటీవలె హాస్పటల్స్ నందు వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కొరకు ముఖ్యమంత్రి సహాయనిధికి ధరఖాస్తు చేసుకున్న 86 మందికి రూ.42.14 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు కాగా సదరు చెక్కులను శనివారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ళ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక తప్పని పరిస్థితులలో అప్పు చేసి హాస్పటల్స్ నందు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ఈ సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తుందన్నారు. ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ ధృక్పదానికి నిదర్శనమని ఎమ్మెల్యే వేగుళ్ళ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆర్థిక స్థోమత లేనివారికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందన్నారు. అన్ని రంగాలను అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని ఈ సంధర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డు, గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ చైర్మన్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలి



- చైర్మన్ పదవికి బీ ఆర్ నాయుడు అనర్హుడు
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 4:**తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ గా కొనసాగే నైతిక హక్కు బి ఆర్ నాయుడుకు ఎంత మాత్రం లేదని రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, వైఎస్సార్సీపీ మండపేట నియోజకవర్గ ఇన్ చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఓ మహిళ పట్ల బీ ఆర్ నాయుడు ప్రవర్తించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రమంతటా నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఆందోళన బాట పట్టింది. వైసీపీ అధిష్టానం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నేతృత్వంలో మండపేటలో వైసీపీ శ్రేణులు నిరసన తెలిపాయి. విజయలక్ష్మి నగర్లో ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. సినీ రోడ్డు రాజారత్న జంక్షన్ మీదుగా బస్టాండ్ నుంచి కలువ పువ్వు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ఉన్నతమైన టిటిడి చైర్మన్ పదవిలో ఉన్న బిఆర్ నాయుడు ఒక మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన తీరు యావత్ రాష్ట్రం అసహ్యించుకునేలా ఉందన్నారు. సోషల్ మీడియా ద్వారా నాయుడు వీడియోలు ప్రత్యక్షంగా కనిపిస్తుంటే దానిపై బొంకడం సిగ్గుచేటన్నారు. చేసిన తప్పును ఒప్పుకుని వెంకటేశ్వరస్వామి వారి ముందు లెంప లేసుకుని పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేయకుండా ఇంకా కొనసాగడం జుగుప్సాకరం అన్నారు. తిరుమల పవిత్రతను ఇంకా దిగజార్చారని మండిపడ్డారు. ఈ సంఘటనపై ప్రశ్నిస్తున్న వైసీపీ గొంతును నొక్కాలని కూటమి ప్రభుత్వం చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వ్యక్తిని పదవి నుంచి దించి తిరుమల పవిత్రతను కాపాడకుండా సీఎం చంద్రబాబు ఆ వ్యక్తికే కొమ్ము కాయడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. వెంటనే నాయుడిని పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇర్రిపాకలో రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 4:** రికార్డులు ట్యాపరింగ్ చేయకుండా బార్ కోడింగ్, ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకలో 762 మంది రైతులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. తహసిల్దార్ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో వైసిపి నేతలు రెవెన్యూ రికార్డులను ట్యాపరింగ్ చేసి నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించారని, వీటి ద్వారా సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకుని ఎగవేశారని విమర్శించారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జగన్ ఇప్పటికీ అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని, ఆయన పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఎన్నికల మిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. కుటమి ప్రభుత్వం రాజ ముద్ర తో కూడిన పాస్ పుస్తకాలు పంపిణీ తో పాటు భూమి హక్కుదారుడైనటువంటి రైతు ఫోటో ముద్రించి క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలు తెలుసుకునే విధంగా పాస్ పుస్తకం తయారు చేయడం జరిగిందని జగన్ తన బొమ్మలతో పాస్ పుస్తకాలు ముద్రించి రాష్ట్రంలో రైతుల భూమిని తన సొంత భూమి లాగా ఫోజు కొట్టాడని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తీవ్రస్థాయిలో విమర్శించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, క్లస్టర్ ఇంచార్జి బస్వా చినబాబు, ఇర్రిపాక గ్రామ టిడిపి అధ్యక్షులు జ్యోతుల నాగబాబు, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోదిరెడ్ల సుబ్బారావు, జ్యోతుల సత్యమూర్తి, పంతం సత్యనారాయణ, పంతం తమ్మి రాజుబాబు, జ్యోతుల వీరభద్రరావు జగ్గంపేట రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి మంగపతి నాయుడు బాబు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 4 :**పట్టణంలో శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో కొనసాగింది. పాస్టర్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు బిషప్ డాక్టర్ డేనియల్ పాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యేసుక్రీస్తు చూపిన ప్రేమ, త్యాగం, క్షమా భావం ప్రతి మనిషి జీవితానికి మార్గదర్శకమని అన్నారు. శత్రువునైనా ప్రేమించాలన్న ఆయన బోధనలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వానికి పునాది వేస్తాయని పేర్కొన్నారు. కరుణ, సహనం, ప్రేమకు ప్రతీకగా నిలిచిన యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శమని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు క్రైస్తవ సోదర సోదరీమణులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

## సేవ స్ఫూర్తితో సంగిత జయంతి వేడుకలు.

* ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 04;**మెగా కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, ప్రజా నాయకుడు, స్వర్గీయ శ్రీ సంగిత సాయి గుణరంజన్, జయంతి వేడుకలను,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, పినపళ్ళ మాజీ గ్రామ సర్పంచ్ సంగిత సుభాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ముందుగా సాయి గుణరంజన్ సోదరులు సంగిత సుభాష్ రామ్మూర్తి,సంగిత అభిమానులులతొ కలిసి సాయి గుణరంజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఆసుపత్రి సిబ్బందికి పండ్లు రొట్టెలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,గారపాటి, శ్రీనివాస్ నామాల సుబ్బారావు, కొనగళ్ళ ధనరాజు,యనమదల శ్రీనివాస్, చల్లాబాబి,సిరిగినీడి పట్టాభి,మాకినిడి బాబి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారి చౌదరికి అభినందనలు

మాజీ సర్పంచ్ రాంబాబు చే ఘన సత్కారం



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 04;**మండలంలోని గుమ్మిలేరు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ కెవి చౌదరి కి ఘన సత్కారం జరిగింది. ఆగ్రామ మాజీ సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆయన్ని ఆలమూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తగిన తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు.

## జోరుగా జనసేన సభ్యత్వాలు నమోదు




**కాట్రేనికోన పెన్ పవర్ ఏప్రిల్ 4:**జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పెనుమల్లె లక్ష్మీవాడ,బంటుమల్లి గ్రామాల్లో త్రీమెన్ కమిటీ సభ్యులు వాసంశెట్టి కుమార్, ఆకుల ప్రవీణ్, పర్యటించి సభ్యత్వ నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు,

ప్రతి ఒక్కరూ జనసేన పార్టీ సభ్యత్వం చేయించుకుంటే వచ్చే ప్రయోజనాలు మరియు పార్టీ పోలోపేతం కోసం అనేక విషయాలను వివరించారు, అనంతరం జనసేన సభ్యత్వం కలిగి అకాల మరణం చెందిన లక్ష్మివాడ గ్రామ జన సైనికుడు మాకే శ్రీను కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి 7 వేలు ఆర్థిక సహాయం జనసైనికులు అందించారు,ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఓగురి భాగ్యశ్రీ, కాట్రేనికోన మండల అధ్యక్షులు మోకా బాల ప్రసాద్,ముమ్మిడివరం మండల అధ్యక్షులు దూడల స్వామి, ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రి సలహాదారుడు బద్రి రమా, నాయకులు గాలిదేవర బుల్లి, నూకల దుర్గ,వంగా విజయ సీతారాం, రమేష్,త్సవటపల్లి వెంకటేశ్వర రావు, అడప సాయి,బళ్ల కుమార్,కాయల బలరాం,గాలి దేవర గణేష్,వంగా తులసి కృష్ణ,వంగా నాగేంద్ర శ్రీనివాస్,కుంచే సత్య ప్రసాద్, గాలిదేవర శ్రీనివాస్,మరియు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## తిరుమల పవిత్రతను కాపాడాలి



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 4:** తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను మంటగలుపుతున్న ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ బి.ఆర్ నాయుడుని వెంటనే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం జగ్గంపేట నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ తోట నరసింహంనిరసన వ్యక్తం చేశారు. జగ్గంపేట గ్రామంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ రాజగోపాల స్వామి ఆలయంలో
ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా తోట నరసింహం మీడియాతో మాట్లాడుతూ పరమ పవిత్రమైన తిరుమల క్షేత్రానికి ఛైర్మన్‌గా ఉంటూ బి.ఆర్. నాయుడు చేస్తున్న అనైతిక కార్యకలాపాలు, ఆయన వాడుతున్న భాష కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని భక్తులు ఇంతగా ఆందోళన చెందుతున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎటువంటి చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉంటున్నారని టీటీడీ పవిత్రతను కాపాడాలంటే బి.ఆర్. నాయుడుని తక్షణమే ఛైర్మన్ పదవి నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆ భగవంతుడు బి ఆర్ నాయుడుకి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వర స్వామి భక్తుల నమ్మకాన్ని ప్రభుత్వం గౌరవించాలిలని తోట నరసింహం అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గణేష్ రాజా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 04;**సర్పంచ్ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం మండల పరిధి 18 గ్రామాలలో వారంతా బాధ్యతలు స్వీకరించారు. ఆలమూరు, మడికి, చెముడులంక, చొప్పెల్ల పంచాయతీలలో ఎంపీడీవో ఏ.రాజు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించి వివరాలు వెల్లడించారు. అలాగే పెనికేరు, నవాబుపేట పంచాయతీలకు మండల పరిషత్ ఏవో ఏం.వి.మెహర్ ప్రకాష్, గుమ్మిలేరు, మోదుకూరు పంచాయతీలకు వ్యవసాయ శాఖ ఏడిఏ సిహెచ్.కె.వి.చౌదరి, జన్నాడ, పెదపల్ల, సూర్యారావుపేట పంచాయతీలకు తహసిల్దార్ కే.జే.ప్రకాష్ బాబు, బడుగువానిలంక, మూలస్థానం, నర్సిపూడి గ్రామాల పంచాయతీలకు వ్యవసాయ శాఖ ఏవో బి.మీనా, పినపల్ల, సందిపూడి గ్రామాల పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో ఎస్.వీర్రాజు, చింతలూరు, కలవచర్ల గ్రామాల పంచాయతీలకు ఎంఈఓ బి.అప్పాజీ ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. తదుపరి ఉత్తర్వుల వరకు వీరే పంచాయతీలకు పాలన అధికారులుగా వ్యవహరిస్తారని ఎంపీడీవో రాజు తెలిపారు. దీంతో ప్రత్యేక అధికారులకు పలువురు నాయకులు, స్థానిక కార్యదర్శులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## మహనీయుల విగ్రహాల రక్షణకు పటిష్ట చర్యలు-ఎస్సై ఎం.మోహన్ కుమార్






**కాజులూరు, పెన్ పవర్,ఏప్రిల్ 4:**గొల్లపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న మహనీయుల విగ్రహాల రక్షణ కోసం పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, మరియు కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి దేవరాజ్ పాటిల్ మనీష్, ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.కాకినాడ రూరల్ ఇన్‌స్పెక్టర్ డీఎస్ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై ఎం. మోహన్ కుమార్ మరియు పోలీసు సిబ్బంది పలు గ్రామాల్లో పర్యటించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలను పరిశీలించారు.ఈ సందర్భంగా విగ్రహ కమిటీ సభ్యులతో సమావేశమై భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. విగ్రహాల వద్ద నిరంతర నిఘా కోసం తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి సక్రమంగా పనిచేసేలా చూడాలని సూచించారు. రాత్రి వేళల్లో అవాంఛనీయ ఘటనలు నివారించేందుకు సరిపడా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.మహనీయుల విగ్రహాల పట్ల గౌరవాన్ని చాటుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని,అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కమిటీ సభ్యులు, స్థానిక యువతకు సూచించారు.విగ్రహాలకు ఎటువంటి నష్టం కలగకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ఉద్దేశపూర్వకంగా విగ్రహాలను ధ్వంసం చేయడం లేదా అగౌరవపరిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.


## కాకినాడలో జోయాలుక్కాస్ 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ప్రారంభం



**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 4:** ప్రముఖ ఆభరణాల సంస్థ జోయాలుకాస్ ఆధ్వర్యంలో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' శనివారం నుంచి కాకినాడలోని షోరూమ్‌లో ప్రారంభమైంది.వజ్రాల ఆభరణాల్లో నైపుణ్యం, సొగసు, ఆధునిక డిజైన్‌ల సమ్మేళనంగా ఈ ప్రత్యేక ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటోంది.పెళ్లి వేడుకల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సెట్ల నుండి రోజువారీ వినియోగానికి అనువైన ఆధునిక డిజైన్‌ల వరకు విభిన్న శ్రేణిలో వజ్రాల ఆభరణాలు ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. ప్రతి ఆభరణం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ సంప్రదాయం మరియు ఆధునికతకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ డిజైన్‌లు పరిమిత కాలానికి మాత్రమే లభ్యమవుతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ వజ్రాల శాశ్వత ఆకర్షణను ప్రతిబింబించే ఈ ప్రదర్శన వినియోగదారులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తుందని పేర్కొన్నారు.కాకినాడ తమ వ్యాపార విస్తరణలో కీలక స్థానం కలిగిన ప్రాంతమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర జోన్ రీజినల్ మేనేజర్ రీజిష్ ఓ.ఎస్., కాకినాడ షోరూమ్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ జియో సెబాస్టియన్ తదితరులు పాల్గొన్నారు. వజ్రాల ఆభరణాల అందాన్ని ఆస్వాదించాలనుకునే వారు ఈ ప్రత్యేక ప్రదర్శనను సందర్శించాలని సంస్థ ప్రతినిధులు ఆహ్వానించారు.

## రావులపాలెంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలకు గౌరవం





**జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నేతలకు సన్మాన సభ -- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు**

**రావులపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 4:**కొత్తపేట నియోజకవర్గంలో రాజకీయ ఉత్సాహం ఉట్టిపడింది. రావులపాలెం లోని సి.ఆర్.సి ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ప్రజాప్రతినిధుల అభినందన సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షత వహించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలకు గౌరవ వేదికను ఏర్పాటు చేశారు.

ఈ సన్మాన సభకు ముఖ్య అతిథులుగా పిల్లి సుభాష్ చంద్రబోస్, జక్కంపూడి విజయలక్ష్మి, గొల్లపల్లి సూర్యరావు, మురళి కృష్ణం రాజు పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక శోభ తీసుకొచ్చారు.

గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు, కొత్తపేట మండలాల్లో ప్రజల విశ్వాసంతో ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్లు, సొసైటీ అధ్యక్షులు తదితర ప్రజాప్రతినిధులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. సభా వేదికపై వారికి శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి గౌరవించారు.ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సేవే ప్రధాన ధ్యేయమని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అందరూ కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.సభకు భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమ ప్రాంగణం మొత్తం పార్టీ జెండాలు, నినాదాలతో మార్మోగింది. నాయకుల ప్రసంగాలకు కార్యకర్తలు హర్షధ్వానాలతో స్పందించారు. కొత్తపేట నియోజకవర్గంలో ఈ సన్మాన సభ రాజకీయ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ పార్టీ శక్తిని ప్రతిబింబించిన ఘట్టంగా నిలిచింది.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక అధికారుల బాధ్యతల స్వీకారం





**కాజులూరు, పెన్ పవర్, ఏప్రిల్ 4:**కాజులూరు మండలంలో గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు శనివారం పలు గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించారు. అంద్రంగి గ్రామపంచాయతీలో మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి నాగ సుజాత, పంచాయతీ కార్యదర్శి కె.వి. రవి ప్రసాద్, పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొని వి. అశోక్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అలాగే మండల విద్యాశాఖ అధికారి-2 పి. జాన్ జగన్నాథగిరి మరియు తర్లంపూడి గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇషాంత్ , సంబంధిత గ్రామాల పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారులు మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందించి, గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో పారదర్శక పాలన, వేగవంత మైన అభివృద్ధి లక్ష్యంగా ప్రత్యేక అధికారులు తమ బాధ్యతలను ప్రారంభించడం గమనార్హం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ప్రేమ, సమానత్వానికి ప్రతీక రన్ ఫర్ జీసస్


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి





**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 4 :** ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని (ఈస్టర్) పురస్కరించుకుని మండల క్రైస్తవ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో పెద్దాపురం పట్టణంలో శనివారం రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ నిర్వహించారు. రన్ ఫర్ జీసస్ కో ఆర్డినేటర్ రెవరెంట్ డాక్టర్ పురుషోత్తం దాస్ లంకా ఆధ్వర్యంలో తొలుత రెవరెంట్ డాక్టర్ సి.హెచ్. రాజేష్ నోబెల్, బిషప్ డాక్టర్ సి.బి.ఐ. సుకుమార్ ప్రార్థనలు అనంతరం ఈ ర్యాలీని విజయలక్ష్మి హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ విజయలక్ష్మి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. చేతిలో శాంతి పతాకాలు పట్టుకుని, క్రైస్తవ కీర్తనలు పాడుతూ భక్తిభావంతో సాగిన ఈ ర్యాలీ పట్టణంలోని అన్ని ప్రధాన వీధులగుండా కొనసాగింది. పట్టణంలోని ముఖ్య కూడళ్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దైవజనులు ప్రార్థించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు ప్రసంగిస్తూ ఏసుక్రీస్తు మరణాన్ని గెలిచి తిరిగి లేచిన ఈ శుభ తరుణం మానవాళికి నిరీక్షణను, సంతోషాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. సమస్త మానవాళికి ప్రేమతత్వం బోధించిన జీసస్ జీవితం స్ఫూర్తిదాయకమని, మానవాళి రక్షణ కోసం ఈలోకంలో జన్మించారని, అందరినీ సమానంగా చూడాలని, ప్రేమ, కరుణ భావాలతో మెలగాలని, సేవతో ఉండాలని చెప్పిన కరుణమయుడన్నారు. ఏసుక్రీస్తు పలికిన శాంతి కరుణ దయ ప్రేమను ఇతరులకు పంచాలని, దాన్ని చాటి చెప్పడమే రన్ ఫర్ జీసస్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. గత 15 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ రన్ ఫర్ జీసస్ ర్యాలీ ద్వారా క్రైస్తవుల మధ్య ఐక్యత పెరగడమే కాకుండా, క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో నడవాలనే ప్రేరణ కలుగుతుందని తెలిపారు. ఈస్టర్ సందర్భంగా ఆ దేవుని అనుగ్రహం అందరిపైనా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాన్ పలివెల,డి. వెంకట్ పాల్, జె. జోసెఫ్ కుమార్, జి. సత్యానందం, డాక్టర్ సి హెచ్. జ్యోతి బాబు, జి. చందు స్టీఫెన్, పి. కిషోర్, పి.చిన్ని, తలారి విజయకుమార్, ఎన్. ఇమ్మానుయేల్ సహాయం, పరంజ్యోతి, రెవరెంట్ లాజరస్ డానియేల్, కె. నాగ శ్రీనివాస్ జిమ్స్, జి. ఆనంద్ శామ్యూల్, రెవరెంట్ బి. యోసేపు, ఎం. రవీంద్రబాబు, పి. ప్రసాదరావు, బి. విద్యాసాగర్, ఎన్. భాస్కరరావు, వై.ఆర్.మన్నా, రెవరెంట్ బి. రత్నరాజు, బ్రదర్ జె. సుధాకర్, ఎం. సుధాకర్, జేసుదాస్ లంక, సిహెచ్. స్టీవెన్, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన మహిళను కాపాడిన జిల్లా పోలీసు శక్తి టీం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 4**
ఈనెల మూడవ తేదీన సాయంత్రం పుష్కర్ ఘాట్ వద్ద శక్తి టీంలు పెట్రోలింగ్ చేస్తూ శక్తి యాప్స్ డౌన్లోడ్ చేస్తూ ఉండగా, కొంతమంది పుష్కర్ ఘాట్ లో ఒక మహిళ ఆత్మహత్య ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. వెంటనే స్పందించిన జిల్లా పోలీసు శక్తి టీం సభ్యులు ఆ ప్రదేశం వద్దకు వెళ్లి ఆమెను కాపాడి పైకి తీసుకుని వచ్చారు. ఆమెను వివరాలను అడుగగా తనది కోనసీమ జిల్లా , అయినవిల్లి మండలము,కాప చింతలపూడి గ్రామమని, తన భర్తతో గొడవల వల్ల చనిపోవడానికి వచ్చినట్లు తెలిపింది.
వెంటనే ఆమెను మహిళా పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకుని వచ్చి తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఆమె బంధువులకు అప్ప చెప్పడం జరిగిందని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మంగాదేవి తెలిపారు.

## నైతిక విలువలతో టీటీడీ చైర్మన్ పదవికి బి ఆర్ నాయుడు రాజీనామా చేయాలి





- రూరల్ వైసీపీ శ్రేణుల ఆధ్వర్యంలో
- శ్రీ కనకదుర్గమ్మ ఆలయం లో చెల్లు బోయిన పూజలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 4:** ప్రపంచవ్యాప్తంగా హిందువులకు ఆది దేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ చైర్మన్ బి ఆర్ నాయుడు నైతిక విలువలతో పదవికి రాజీనామా చేయాలని వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ డిమాండు చేశారు. ఆయన అసభ్య ప్రవర్తనతో హిందువుల మనోభావాలు దెబ్బతీసిన ఆయన పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారణ జరిపించి పదవి నుంచి తొలగిం చాలని, తిరుమల పవిత్రతను కాపాడాలని కోరారు. రూరల్ వైసిపి శ్రేణులు స్థానిక బాలాజీ పేట శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో శనివారం చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిం చారు. తిరుమల అపవిత్రం చేసిన బి ఆర్ బి ఆర్ నాయుడును తొలగిం చాలని, తిరుమల దేవస్థానం పవిత్రతను కాపాడాలని, హిందూ భక్తుల మనోభావాలను కాపాడాలని, కూటమి ప్రభుత్వ పాలన సిగ్గు, సిగ్గు
ప్ల కార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో చెల్లు బోయిన మాట్లాడుతూ
పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ గా ఉంటూ అసభ్య ప్రవర్తన వీడియోలతో, హిందూ భక్తుల మనోభావాలను, తిరుమల పవిత్రత ను దెబ్బతీశారని విమర్శించారు. అంతకుముందు కూటమి ప్రభుత్వ నేతలు , సీఎం చంద్రబాబు నాయుడు పవిత్రమైన లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కల్తీ జరిగిందని హిందువులను మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఎస్వీ వి బీసీ చైర్మన్ గా ఉన్న పృథ్వీరాజ్ అనే సినీనటుడిని అసభ్యంగా మాట్లాడితే పదవి నుంచి తొలగించిన జగన్ సంగతిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ వైసిపి నాయకులు గొందేసి శ్రీనివాసరెడ్డి, నక్క రాజబాబు, దాసరి ధర్మ, సత్య గిరి ,రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ మొల్లేరు--జడేరు గ్రామాల్లో పర్యటించిన డిప్యూటీ ఎంపీడీవో గోపన్నదొర






**గంగవరం, పెన్ పవర్ ఏప్రిల్ 4 :** స్వర్ణ మొల్లేరు మరియు స్వర్ణ జడేరు గ్రామాల స్పెషల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఎంపీడీవో కె. గోపన్నదొర శనివారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మంచినీటి సరఫరా సక్రమంగా జరుగుతున్నదా అనే విషయాన్ని పరిశీలించి, ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు తాగునీరు అందించాలని సిబ్బందికి సూచించారు.మొల్లేరు గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన, ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సిన పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు ఆదేశించారు. అలాగే జడేరు గ్రామంలో మంచినీటి ట్యాంకును పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు సరఫరా చేయాలని తెలిపారు.గ్రామ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన గోపన్నదొర, స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు డోర్ టు డోర్ చెత్త సేకరణ చేపట్టి గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని ఎస్ డబ్ల్యు పి సి సిబ్బంది, క్లాప్ మిత్రలకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు మరియు స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో కల్తీ పాలపై నియంత్రణ చర్యలు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఏప్రిల్ 4** :జిల్లాలో కల్తీ పాల ఘటనల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ , ఫుడ్ సేఫ్టీ విభాగాలు సంయుక్తంగా విస్తృత చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పశు సంవర్ధక అధికారి టి. శ్రీనివాస రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కె. సుప్రియ శనివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 705 పాల నమూనాలను పరీక్షించగా, అందులో 15 నమూనాల్లో కల్తీ ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో 1 యూరియా, 8 డిటర్జెంట్, 2 మాల్టోడెక్స్ట్రిన్, 5 నాణ్యత ప్రమాణాలకు తగని నమూనాలు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులపై ఆహార భద్రతా చట్టం అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22 నుండి జిల్లాలో ర్యాండమ్‌గా రాపిడ్ టెస్టులు నిర్వహిస్తూ కల్తీ పాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వారం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ర్యాండమ్ గా రాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాలు ఉత్పత్తి, సరఫరా, మార్కెటింగ్, ఇంటింటికి విక్రయాలు చేసే వారందరూ తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని స్పష్టం చేశారు. స్థానిక పశు సంవర్ధక శాఖ లేదా సచివాలయ సిబ్బందిని సంప్రదించి తమ వివరాలను ఎఫ్ ఎఫ్ ఎస్ ఏ ఐ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పాలు, అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారిని గుర్తించి, వారి పేర్లు నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు. ఇంటి వద్ద లేదా విడిగా పాలు కొనుగోలు చేస్తున్న ప్రజలను భాగస్వామ్యం చేస్తూ, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.
జిల్లాలో కల్తీ పాల వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఆదిన కృష్ణబాబుకు ముద్రగడ గిరిబాబు పరామర్శ.



**కిర్లంపూడి, పెన్ పవర్ ఏప్రియల్ 04**:మండల కేంద్రమైన కిర్లంపూడి గ్రామానికి చెందిన ఆదిన కృష్ణ బాబుకు ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు.ఆదిన కృష్ణబాబు తల్లి ఆదిన ముత్యామణి ఇటీవల కాలంలో స్వర్గస్తులైనారు.విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు శనివారం కృష్ణ బాబు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ముత్యామణి మృతి పట్ల తన తీవ్ర ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. ఆయన వెంట జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, పవర కిట్టబాబు,కుటుంబ సభ్యులు ఉన్నారు.

## అంబేద్కర్ జయంతి, బాబు జగజ్జీవన్ రావు జయంతి వేడుకల్లో అసంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దు.





**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 4:** సర్కిల్ ఇన్స్పెక్టర్ బి తిరుపతిరావు ఎస్సై శివ నాగబాబు..
మండలంలో జరగబోయే అంబేద్కర్ జయంతి,బాబు జగజ్జీవన్ రావు వేడుకలను కమిటీ సభ్యులు క్రమశిక్షణతో నిర్వహించాలని ఎటువంటి బాణాసంచా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ దీ. తిరుపతిరావు గారు గండేపల్లి ఎస్సై .శివ నాగబాబు తెలిపారు శనివారం మండలంలో అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రావు విగ్రహాలను పరిసరాలను పరిశీలించి కమిటీ సభ్యులతో మాట్లాడారు జరగబోయే అంబేద్కర్ జయంతి వేడుకలను ఆహ్లాదకరమైన వాతావరణంలో సాంస్కృతి కార్యక్రమాలతో నిర్వహించాలని తప్ప ఎటువంటి గొడవలు అసాంఘిక కార్యక్రమాలు బాణ సంచా పేలుళ్లు నిర్వహించరాదని అలా ఎవరైనా నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని కమిటీ సభ్యులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మూర్తి కానిస్టేబుల్ బాలాజీ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇంపాక్ట్‌గా వచ్చి ఇరగదీసిన రిజ్వీ.. ముంబైపై ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ లో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానంలో జరుగుతున్న పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచులో ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన సమీర్ రిజ్వీ (90 పరుగులు) మరోసారి అసలైన పైసా వసూల్ పర్ఫార్మెన్స్ అంటే ఏంటో చూయించాడు. టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ మొదట ఫీల్డింగ్ తీసుకున్నాడు. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ జట్టు 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. ముంబై బ్యాటర్లలో సూర్యకుమార్ యాదవ్ (51) హాఫ్ సెంచరీ చేయగా, రోహిత్ (35), నమన్ ధీర్ (28) అద్భుతమైన బ్యాటింగ్ తో కీలక పాత్ర పోషించారు. అనంతరం 163 పరుగుల లక్ష ఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆదిలోనే బిగ్ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మరోసారి ఘోరంగా విఫలం కాగా.. ఆ తర్వాత బ్యాటింగ్ కి వచ్చిన నితీష్ రాణా (0) రనౌట్ అయ్యాడు. దీంతో కేవలం 7 పరుగులకే ఢిల్లీ కీలకమైన రెండు వికెట్లను నష్టపోయింది. ఓపెనర్ పతుమ్ నిస్సంకతో కలిసి ఇంపాక్ట్ ప్లేయర్ సమీర్ రిజ్వీ 66 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అనంతరం మిచెల్ శాంట్నర్ బౌలింగ్ లో నిస్సంక (30 బంతుల్లో 6 ఫోర్లు ఒక సిక్సుతో 44 పరుగులు) కొట్టిన బంతి నేరుగా మయాంక్ మార్కండే చేతిలో పడటంతో పెవిలియన్ కి వెళ్లిపోయాడు.

ఇక ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన రిజ్వీ మరోసారి

తన ఇంపాక్ట్ చూపించాడు. తనదైన ట్రేడ్ మార్క్ షాట్స్ తో కష్టాల్లో ఉన్న జట్టుని సమీర్ ( 51 బంతుల్లో 7 ఫోర్లు 7 సిక్సులతో 90 పరుగులు) అర్ధ శతకంతో మ్యాచుని విజయ తీరాలకు చేర్చగా.. చివర్లో డేవిడ్ మిల్లర్ (21ఌ), ట్రిస్టన్ స్టబ్స్(3ఌ) మరో 18.1 ఓవర్లలోనే మ్యాచ్ ని కంప్లీట్ చేసేశారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇక, ముంబై ఇండియన్స్ బౌలర్లలో మిచెల్ శాంటర్న్, దీపక్ చాహర్, కార్బిన్ బాష్ తలో వికెట్ పడగొట్టారు.

## టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న రాజస్థాన్.. కెప్టెన్‌నే మార్చేసిన గుజరాత్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతున్న కీలక పోరులో రాజస్థాన్ రాయల్స్ టాస్ గెలిచింది. రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ తీసుకున్నాడు. ఈ మైదానంలో స్కోరును డిఫెండ్ చేయడం సులభమని భావించిన పరాగ్ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మరోవైపు గుజరాత్ టైటాన్స్ (GT) జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కండరాల నొప్పితో (Muscle Spasm) ఈ మ్యాచ్‌కు దూరం అయ్యాడు. అతని స్థానంలో స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ జట్టు పగ్గాలను చేపట్టాడు. రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాట్లాడుతూ.. ముందుగా బ్యాటింగ్ చేయడం తమకు సరైన నిర్ణయం.. పిచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడాల్సిన అవసరం ఉందని తెలిపారు. సుమారు 210 పరుగుల భారీ స్కోరు సాధించి, దానిని డిఫెండ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జట్టు అన్ని పరిస్థితుల్లో ఆడగలిగే విధంగా తయారవ్వాలని ఆకాంక్షించారు. ఇక తుది జట్టులో రెండు మార్పులు చేశాం.. బ్రిజేష్ స్థానంలో తుషార్ దేశ్‌పాండే చోటు దక్కించుకున్నాడు. అలాగే రవి బిష్ణోయ్ స్థానంలో శుభమ్ దూబే జట్టులోకి వచ్చాడని పేర్కొన్నాడు. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ రషీద్ ఖాన్ మాట్లాడుతూ.. తాము టాస్ గెలిచి ఉంటే ముందుగా బౌలింగ్ చేయాలని అనుకున్నాం.. శుభ్‌మన్ గిల్‌కు కండరాల సమస్యతో ఈ మ్యాచ్ ఆడటం లేదు.. త్వరలోనే తిరిగి జట్టులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం.. కొత్త ఆటగాడు కేకే తన తొలి మ్యాచ్ ఆడుతున్నాడు.. అతని ప్రదర్శనను చూడటానికి ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. గత మ్యాచ్‌లోనూ జట్టు మంచి క్రికెట్ ఆడిందని, ఈ మ్యాచ్‌లో 100 శాతం సామర్థ్యంతో ఆడాల్సిన అవసరం ఉందని తెలిపాడు.

**తుది జట్లు:**

రాజస్థాన్ రాయల్స్: యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్(వి), రియాన్ పరాగ్(సి), షిమ్రాన్ హెట్మెయర్, డోనోవన్ ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, తుషార్ దేశ్‌పాండే, సందీప్ శర్మ

గుజరాత్ టైటాన్స్: కుమార్ కుషాగ్రా, సాయి సుదర్శన్, జోస్ బట్లర్(వి), గ్లెన్ ఫిలిప్స్, వాషింగ్టన్ సుందర్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్(సి), కగిసో రబడ, అశోక్ శర్మ, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ కృష్ణ

## ధోనీ రికార్డ్ బ్రేక్ చేసిన హిట్ మ్యాన్.. ఆరెంజ్ క్యాప్‌ని కైవసం చేసుకున్న రోహిత్






**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 ప్రారంభం నుంచే రోహిత్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ చేస్తున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో కేవలం 38 బంతుల్లో 78 రన్స్ చేయగా.. ఈరోజు (2026, ఏప్రిల్ 4న) ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ 26 బంతుల్లో 35 పరుగులు చేసి మొత్తం 113 పరుగులతో అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్ల జాబితాలో నెంబర్ స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ ప్లేయర్ కూపర్ కునోలీ 108 పరుగులతో సెకండ్ ప్లేస్ లో కొనసాగుతున్నాడు. కాగా ఐపీఎల్ చరిత్రలో ఒకే ప్రత్యర్థిపై అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాళ్ల లిస్టులో రోహిత్ ఇప్పుడు కొత్త రికార్డు సృష్టించాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌పై హిట్ మ్యాన్ ఇప్పటి వరకు 51 సిక్సర్లు కొట్టాడు. దీంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై 50 సిక్సులు కొట్టిన మహేంద్ర సింగ్ ధోనీ పేరు ఉన్న రికార్డుని రోహిత్ బ్రేక్ చేసినట్లు అయింది. అలాగే విరాట్ కోహ్లీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై 48 సిక్సర్లతో ఈ జాబితాలో ఇంకా వెనకబడి ఉన్నాడు.

**ఒకే ప్రత్యర్థిపై అత్యధిక సిక్సర్లు:**

క్రిస్ గేల్ (పంజాబ్‌పై): 61
క్రిస్ గేల్ (కేకేఆర్ పై): 54
రోహిత్ శర్మ (ఢిల్లీపై): 51
ధోనీ ( ఆర్సీబీపై): 50
విరాట్ కోహ్లీ (సీఎస్కేపైపై): 48

కేవలం రన్స్ చేయడమే కాకుండా, రోహిత్ శర్మ సుమారు 176కు పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం ఫ్యాన్స్ ని అలరిస్తోంది. ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్ ప్రారంభంలోనే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి జట్టుకు భరోసా కల్పిస్తున్నాడు. ముఖ్యంగా పుల్ షాట్లు, లాంగ్ ఆన్ దిశగా కొట్టే సిక్సులతో వాంఖడే స్టేడియంలో హోరెత్తించాడు. ఈ సీజన్‌లో రోహిత్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే మరిన్ని రికార్డులు బ్రేక్ కావడం ఖాయమని క్రీడా పండితులు పేర్కొంటున్నారు. మరోవైపు కింగ్ కోహ్లీ కూడా అద్భుతమైన ఫామ్‌లో కనిపిస్తున్నాడు, రోహిత్ నెలకొల్పిన ఈ సిక్సర్ల రికార్డును అందుకోవడం కోహ్లీకి ఇప్పుడు సవాల్‌గా మారింది. హిట్ మ్యాన్ బ్యాటింగ్‌లో దూకుడుతో ముంబై జట్టుకు అదనపు బలాన్ని అందిస్తోంది. ఐపీఎల్ 2026లో ఆరెంజ్ క్యాప్ రేసులో రోహిత్, కోహ్లీ మధ్య పోటీ రాబోయే రోజుల్లో మరింత ఇంట్రెస్టింగ్ గా మారనుంది.

## ఇప్పటివరకూ శ్రీరాముడి పాత్రలో నటించిన స్టార్ల జాబితా

భారతీయ సినిమా- బుల్లితెర రంగాల్లో శ్రీరాముడి పాత్రకు ఉన్న ప్రాముఖ్యత అపారం. వెండితెరపై లేదా బుల్లితెరపై రామాయణ గాథను ఆవిష్కరించిన ప్రతిసారీ ప్రేక్షకులు ఆ పాత్రలను దైవ సమానంగా ఆరాధించారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుండి బాలీవుడ్ వరకు... బ్లాక్ అండ్ వైట్ కాలం నుండి నేటి విజువల్ వండర్స్ కాలం వరకు చాలా మంది స్టార్లు రాముడి పాత్రలో మెప్పించారు. ముఖ్యంగా





టాలీవుడ్‌లో ఎన్.టి. రామారావు ఈ పాత్రకు ఒక సంపూర్ణ అర్థాన్ని ఆపాదించారని చెప్పొచ్చు. లవకుశ, సంపూర్ణ రామాయణం వంటి చిత్రాలలో శ్రీరాముడి పాత్రతో తారకరాముడు లక్షలాది మంది హృదయాల్లో నిలిచిపోయారు. టాలీవుడ్ స్టార్ హీరోలు పౌరాణిక పాత్రలపై ఎప్పుడూ మక్కువ చూపేవారు. సీనియర్ ఎన్టీఆర్ తర్వాత అక్కినేని నాగేశ్వరరావు -శ్రీ రామ జననం- (1944) లో, శోభన్ బాబు -సంపూర్ణ రామాయణం- (1971)(బాపు దర్శకుడు) లో రాముడిగా నటించి తమదైన ముద్ర వేశారు. నందమూరి వారసుల్లో బాలకృష్ణ -శ్రీ రామ రాజ్యం- (2011) చిత్రంతో తండ్రికి తగ్గ తనయుడిగా మెప్పించగా... జూనియర్ ఎన్టీఆర్ -బాల రామాయణం- (1997) లో బాల రాముడిగా నటించి జాతీయ అవార్డును సైతం గెలుచుకున్నారు. సుమన్, ప్రభాస్ వంటి వారు కూడా విభిన్నమైన శైలిలో ఈ పాత్రను పోషించి మెప్పించారు. బుల్లితెర విషయానికి వస్తే.. 1987లో రామానంద్ సాగర్ రూపొందించిన -రామాయణ్- ఒక చరిత్రను సృష్టించింది. ఇందులో రాముడిగా నటించిన అరుణ్ గోవిల్ పై ప్రజలు ఎంతటి భక్తిభావం ప్రదర్శించారంటే.. ఆయనను నిజమైన రాముడిగానే భావించి పూజించేవారు. ఆ తర్వాత గుర్మీత్ చౌదరి (2008 రామాయణ్), ఆశిష్ శర్మ (సియా కే రామ్) .. సోనీ టీవీలో టెలికాస్ట్ అయిన -శ్రీమద్ రామాయణ్-లో సుజయ్ రేవూ రాముడి పాత్రలో నేటి తరం ప్రేక్షకులను అలరించారు. ఈ సీరియళ్లు హిందీతో పాటు ఇతర ప్రాంతీయ భాషల్లోనూ డబ్ అయ్యి దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నాయి. సినిమాల్లో కూడా బాలీవుడ్ హీరోలు ఈ పాత్రను పోషించేందుకు ఆసక్తి చూపారు. 1997లో వచ్చిన -లవ్ కుష్- చిత్రంలో అగ్ర నటుడు జితేంద్ర శ్రీరాముడిగా కనిపించి ఆకట్టుకున్నారు. జెన్ జెడ్ కాలంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ -ఆదిపురుష్- (2023) లో రాఘవ పాత్రలో ఆధునిక సాంకేతికతతో కూడిన రాముడిని పరిచయం చేశారు. హరనాథ్, కాంతారావు, శ్రీకాంత్ వంటి ఇతర తెలుగు నటులు కూడా పలు చిత్రాల్లో అతిథి లేదా ప్రధాన పాత్రల్లో రాముడిగా కనిపించి రామాయణ గాథను సజీవంగా ఉంచడంలో తమ వంతు కృషి చేశారు. ప్రస్తుతం భారతీయ సినిమా రంగం నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న -రామాయణ- చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇందులో బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ శ్రీరాముడిగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ , మేకింగ్ వివరాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. గతంలో వచ్చిన అన్ని వెర్షన్ల కంటే ఇది అత్యంత భారీ వ్యూహం తో సాంకేతిక మాయాజాలంతో బరిలోకి దిగుతుండటంతో.. రణబీర్ ఈ పాత్రలో ఎలా కనిపిస్తారనే ఉత్కంఠ నెలకొంది. ఈ ఏడాది దీపావళికి పార్ట్ 1, వచ్చే ఏడాది దీపావళికి పార్ట్ 2 విడుదల కానున్నాయి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com